క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం

చిన్నంబావి: కేఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ కొత్త కళ్యాణ్‌రావు జన్మదినం సందర్భంగా మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం, అంబలి కేంద్రాన్ని జూపల్లి అరుణ్‌కుమార్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విదేశాల్లో ఉన్నత వ్యాపారాలు చేసుకుంటూ.. తన తండ్రి పేరు మీద ట్రస్ట్ ప్రారంభించి సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్న కళ్యాణరావును అభినందించారు. మండలంలో తన సొంత ఖర్చుతో ఆలయాల అభివృద్ధి చేయడంతో పాటు వెల్టూరు గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌యాదవ్, చిదంబర్‌రెడ్డి, నారాయణ, పురేందర్, ధర్మేందర్, జ్యోతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు స్ప్రింక్లర్ల పంపిణీ



వీపనగండ్ల: మండలంలోని కల్వరాల గ్రామంలో 33 మంది రైతులకు స్ప్రింక్లర్ పైపులను అందజేశారు. రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చొరవతో రైతులకు సబ్సిడీ ద్వారా అనంత బయోటెక్ కంపెనీ వారు స్ప్రింక్లర్ పైపులు, నల్లాలను రైతులకు అందజేసినట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధి అంజి, కాంగ్రెస్ నాయకులు చక్ర వెంకటేష్, వెంకటరాజయ్య, చింత దయాకర్, మండ్ల రాముడు, బిల్లకంటి ఆంజనేయులు, దేవాంగుల ఆంజనేయులు, బత్తుల రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వసతులు కరువు



వీపనగండ్ల: వేసవిలో జాతీయ గ్రామీణ ఉపాధి పనుల్లో పాల్గొనే కూలీలకు కల్పించే వసతుల్లో అధికారులు నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శిస్తున్నారని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు అన్నారు. సోమవారం రంగవరంలో ఉపాధి కూలీలతో సమావేశమై వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పని ప్రదేశంలో టెంట్లు, ఓఆర్‌ఎస్ పాకెట్లు, తాగునీటి వసతులు సరైన రీతిలో కల్పించడం లేదని ఆయన విమర్శించారు. పని చేసి రెండు వారాలు గడుస్తున్నా ఆన్‌లైన్ పే స్లిప్‌లు అందజేయలేదని, పలువురు కూలీలకు రావాల్సిన డబ్బులు కూడా సకాలంలో ఇవ్వడం లేదని ఆరోపించారు. కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలు అధికారుల నిర్లక్ష్యంపై ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

ప్రత్యేక పూజలు



వనపర్తి రూరల్: మండలంలోని చిట్యాలలో విఘ్నేశ్వర, నర్మదేశ్వర, సుబ్రహ్మణ్య, ధ్యానాంజనేయస్వామి ఆలయం నిర్మాణం చేసి ఏడాది పూర్తయిన సందర్భంగా మొదటి బ్రహ్మోత్సవం ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. సోమవారం ఉదయం గణపతి, పుణ్యాహ వాచనం, రక్షాధారణం, నవగ్రహ, నాగదేవతల పూజలు చేశారు. సమస్త కళశాభిషేకం, అర్చన, పల్లకీసేవ, మహామంగళహారతి, మంత్ర పుష్పం, హోమాలు జరిపించారు. సాయంత్రం వీరభద్రస్వామి సేవ, శివపార్వతుల కల్యాణం, మహామంగళ హారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం అందించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

ఇఫ్తార్

ఆత్మకూర్: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలకు సోమవారం రాత్రి స్థానిక మస్జిదే నూర్‌లో యూనూస్ ఆధ్వర్యంలో, మస్జిదే సయ్యదియాలో ఖాజపీర్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.

123 ఎకరాల్లో పంట నష్టం

- అకాల వర్షంతో అన్నదాత కుదేలు
- వ్యవసాయాధికారుల క్షేత్ర పర్యటన
- పరిహారం ఇవ్వాలని రైతుల వేడుకోలు



హీర్లతండా సమీపంలో..



ఖిల్లాఘనపురం మండలం సల్కెలాపురం శివారులో నేలకొరిగిన పంటను పరిశీలిస్తున్న అధికారులు

ఖిల్లాఘనపురం: మండలంలో ఆదివారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలను సోమవారం మండల వ్యవసాయ అధికారి మల్లయ్య, ఏఈఓలు పవన్‌కళ్యాణ్, బాలరాజు, పాండు తదితరులతో కలిసి పరిశీలించారు. మండలంలో ముఖ్యంగా అప్పారెడ్డిపల్లి, అల్లమాయపల్లి, మల్కిమియాన్‌పల్లి, సల్కెలాపురం, ఖిల్లాఘనపురం, పర్వతాపురం గ్రామాల్లో ఈదురుగాలులు, వడగండ్ల వాన ప్రభావం ఎక్కువగా ఉందని ఏఓ తెలిపారు. 6 గ్రామాల్లో 63 మంది రైతులకు సంబంధించిన 73 ఎకరాల్లో వరి పంట పాడైనట్లు ఆయన చెప్పారు. అదేవిధంగా 14 మంది రైతులకు సంబంధించి 22 ఎకరాల్లో మొక్కజొన్న, ఆరుగురికి సంబంధించి 28 ఎకరాల్లో మామిడితోటల్లో నష్టం జరిగిందని తెలిపారు. పంటల నష్టంపై పూర్తి స్థాయిలో నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపిస్తామని పేర్కొన్నారు. క్షేత్ర పర్యటనకు వచ్చిన అధికారులకు రైతులు తమ గోడు వెల్లబోసుకున్నారు. ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందించాలని వేడుకున్నారు.

పండ్ల బండ్లపైకి దూసుకెళ్లిన వాహనం



ప్రమాదంలో ధ్వంసమైన బైకులు

ఆత్మకూర్: రోడ్డుపై తోపుడు పండ్ల బండ్లపైకి బొలెరో వాహనం దూసుకెళ్లడంతో ముగ్గురికి తీవ్రగాయాలయిన ఘటన పట్టణంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు.. సోమవారం మధ్యాహ్నం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహం ఎదుట పండ్ల బండ్ల వద్ద వినియోగదారులు పండ్లను కొనుగోలు చేస్తుండగా.. బొలెరో వాహనం ఒక్కసారిగా వారిపైకి దూసుకెళ్లడంతో మస్తీపూర్ గ్రామానికి చెందిన నర్సింహులు, పద్మమ్మ, యశోద గాయాలపాలయ్యారు. ఈ ఘటనలో రెండు బైకులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం క్షతగాత్రులు కోలుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు. బొలెరో వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేందర్ తెలిపారు.

విద్యా సామర్థ్యాలు పెంపొందించాలి



వెంకటాంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థితో చదివిస్తున్న ఎంఈఓ

ఖిల్లాఘనపురం: విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ జయశంకర్ తెలిపారు. సోమవారం మండలంలోని వెంకటాంపల్లి ప్రాథమికోన్నత, ఆగారం ప్రాథమిక పాఠశాలలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుతో చదివించడం, రాయించడం, ఆంగ్ల పదాలను పలికించడం ఇలా పలు ప్రశ్నలు వేసి వారి సామర్థ్యాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం, కూరలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ముఖ్యంగా విద్యార్థులతో తరుచుగా పాఠాలు చదివించడం చదివిన పాఠంలో నుండి ప్రశ్నలు అడగటం, లెక్కలు చేయించడం, రాయించడం చేయాలన్నారు. ఇలా చేయడం వలన ఏ విద్యార్థి ఎలా చదువుతున్నాడు. ఎక్కడ సమస్య వస్తుందో ఉపాధ్యాయులకు గుర్తించడానికి వీలుంటుందన్నారు. విద్యార్థులు ఏ సబ్జెక్టులో వెనకబడ్డారో తెలుస్తుందన్నారు.

బడ్జెట్‌పై రౌండ్‌టేబుల్ సమావేశం



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

వనపర్తి రూరల్: జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో సోమవారం జిల్లా కమిటీ సభ్యుడు పరమేశ్వరాచారి అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, ఎండీ జబ్బార్, జిల్లా నాయకుడు గణేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, పేదలకు వ్యతిరేకంగా బడ్జెట్ ప్రవేశపెట్టారని, ఈ బడ్జెట్‌లో సంపన్నులను మరింత సంపన్నులుగా చేసేందుకు పతిపాదనలు ఉన్నాయని విమర్శించారు. వ్యవసాయ రంగానికి గతం కన్నా రూ.పదివేల కోట్లు తగ్గించారని, ఎరువుల సబ్సిడీకి రూ.11 వేల కోట్ల కోత పెట్టారని, ఉపాధిహామీకి రూ.3 వేల కోట్లు కోత పెట్టారని మండిపడ్డారు. మహాలక్ష్మి పథకానికి రూ.10,008 కోట్లు అవసరం ఉండగా.. కేవలం రూ.4,206 కోట్లు మాత్రమే కేటాయించడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో ఇళ్లు లేని వారు సుమారు 30 లక్షల మంది ఉన్నారని, వారికి ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, గృహజ్యోతి, రైతుభరోసా తదితర పథకాలకు సరిపడా నిధులు కేటాయించలేదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మేకల ఆంజనేయులు, గంధం మదన్, గంధం గట్టయ్య, నందిమళ్ల రాములు, ఎల్ బీసన్న తదితరులు పాల్గొన్నారు.

'కురుమూర్తి' ఆయకట్టుకు సాగునీరు అందించాలి



కురుమూర్తి లిఫ్టు వద్ద బీఆర్‌ఎస్ నాయకులు

మదనాపురం: కురుమూర్తి ఎత్తిపోతల ఆయకట్టు కింద సాగుచేసిన పంటలు ఎండిపోకుండా కాపాడాలని ఈ దిశగా పాలకులు చొరవ తీసుకోవాలని మాజీ జెడ్పీటీసీ కృష్ణయ్యయాదవ్ కోరారు. సోమవారం కొత్తపల్లి వద్ద కురుమూర్తి రాయ ఎత్తిపోతల పథకం ద్వారా విడుదలయ్యే నీటిని పంపుహౌజ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమా పేజ్ 2 కాల్వల ద్వారా మంత్రి జూపల్లి కృష్ణారావు నీటిని తీసుకెళ్తుంటే స్థానిక నాయకులు, ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని ఆరోపించారు. లిఫ్ట్ ద్వారా నాలుగు గ్రామాల ఆయకట్టుకు నెల రోజుల పాటు సాగునీరు అందిస్తేనే పంట చేతికొస్తుందన్నారు. గత సీజన్‌లో నీటిని ఆలస్యంగా అందివ్వడం వలన వరికి ఉల్లికోడు తెగుళ్ల సోకి రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఇప్పుడే ఈ పరిస్థితి ఉంటే మండల ప్రజలకు తాగునీటిని ఎలా అందిస్తారని ప్రశ్నించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో సాగు, తాగునీటికి ఎలాంటి కష్టాలు ఎదుర్కొలేదన్నారు. ఆయకట్టు రైతుల బాధలను తీర్చి వారి పంట పొలాలకు సాగునీరు అందించేందుకు స్థానిక ఎమ్మెల్యే ముందడుగు వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బిట్ల యాదగిరి, నాయకులు విజయేందర్‌రెడ్డి, చాంద్‌పాషా, కురుమూర్తి, బాలు, అనిమొని మాసన్నయాదవ్, రమేష్, రాజ్‌కుమార్, శివశంకర్, టీకే కృష్ణ ఉన్నారు.

బ్రహ్మంగారి నాటక ప్రదర్శన



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి భక్తులు బ్రహ్మంగారి జీవిత చరిత్ర నాటక ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పాత్రదారులు, గురువును శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ బ్రహ్మంగారి చరిత్ర తెలుసుకోవడంతో సుఖసంతోషాలు కలుగుతాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మన్నెపురెడ్డి, నిర్వాహకులు యాదగిరిగౌడ్, భాస్కర్‌రెడ్డి, దత్తాత్రేయరెడ్డి, నాగరాజు, గ్రామస్తులు గోవర్ధన్‌రెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, లక్ష్మారెడ్డి, రవిచందర్‌రావు, నాగేంద్రం, యాదవరెడ్డి, శివాజీరావు తదితరులు పాల్గొన్నారు.

మామిడి విక్రయాలపై అవగాహన సదస్సు

వీపనగండ్ల: మామిడి రైతులకు, కొనుగోలుదారులకు మార్కెట్ గురించి మామిడి క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా ఉద్యానశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం మహబూబ్‌నగర్‌లోని సుదర్శన్ కన్వెన్షన్ హాల్‌లో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు మండల ఉద్యానవనశాఖ అధికారి కృష్ణ, క్లస్టర్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ రవికుమార్ తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందని, మామిడి తోటలు సాగుచేసే రైతులు సందేహాలను నివృత్తి చేసుకోవాలని వారు కోరారు.

రేపు మహాజన సమావేశం

పాన్‌గల్: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సమావేశం డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహిస్తున్నట్లు సీఈఓ భాస్కర్‌గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశంలో 28 సెప్టెంబర్ 2024 నుంచి 25 మార్చి, 2025 వరకు జమ, ఖర్చులు, 2025–26 సంవత్సరం అంచనా బడ్జెట్, ప్రణాళిక ఆమోదించడంపై చర్చిస్తారన్నారు. సమావేశానికి సంఘం సభ్యులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

పాన్‌గల్: ఒకరిపై దాడి చేసి గాయపర్చిన ఘటనపై సోమవారం కేసు నమోదైనట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తెల్లరాళ్లపల్లితండాకు చెందిన లచ్చిరామ్ వద్ద అదే తండాకు చెందిన గోపాల్ మూడేళ్ల క్రితం రూ. 20 వేలు అప్పుగా తీసుకున్నాడు. ఈ క్రమంలో లచ్చిరామ్ ఆదివారం రాత్రి గోపాల్ ఇంటికి వచ్చి ఇంట్లో ఉన్న అతడి తల్లి చిట్టెమ్మ, తండ్రి నర్సింహ ను బూతులు తిడుతూ.. నర్సింహను కట్టెతో తలపై కొట్టడంతో తీవ్ర రక్త స్రావం అయింది. అకారణంగా ఇంటికి వచ్చి తన తండ్రిపై కట్టెతో దాడి చేసి గాయపర్చిన లచ్చిరామ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ గోపాల్ సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ నిరసన



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ సర్పంచ్‌లు, బీఆర్‌ఎస్ నాయకులు

కొత్తకోట రూరల్: సర్పంచ్‌ల పదవీ కాలం పూర్తై ఏడాదిన్నర కావస్తున్నా ఇది వరకు గ్రామాల్లో చేసిన అభివృద్ధికి సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలంటూ సోమవారం పట్టణ కేంద్రంలోని చౌరస్తాలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్ మాట్లాడుతూ.. మాజీ సర్పంచులు తమ పదవీకాలంలో వడ్డీలకు అప్పులు తెచ్చి గ్రామంలో అభివృద్ధి పనులు చేశారన్నారు. ప్రభుత్వం నిధులు చెల్లించకపోవడంతో వారు అప్పులపాలై ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి వీడి సర్పంచ్‌లకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ కలెక్టర్ ఆదర్శ్‌సురభిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీసం చెన్నకేశవరెడ్డి, పి.విశ్వేశ్వర్, ఆకుల శ్రీనివాసులు, ఎద్దుల నగేష్, అయ్యన్న, గాడీల ప్రశాంత్, కె.శ్రీనివాస్‌జీ, బుచ్చన్న, లక్ష్మణ్‌నాయక్, హోటల్‌రాజు, నెహ్రూ, లాలు, వికాస్ తదితరులు ఉన్నారు.

'ప్రాధాన్యత క్రమంలో సమస్యలు పరిష్కరిస్తాం'



మాట్లాడుతున్న ఎంపీఓ రఘురాములు

పాన్‌గల్: తండాలో నెలకొన్న సమస్యలను ప్రాధాన్యత ప్రకారం పరిష్కరిస్తామని ఎంపీఓ రఘురాములు తండావాసులకు హామీ ఇచ్చారు. సోమవారం మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. సభ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలు, పారిశుద్ధ్య కార్మికుల, ఉపాధి కూలీల పెండింగ్ డబ్బులు, జాబుకార్డు ఉన్న ప్రతి కూలీకి పని కల్పించడం, తాగునీటి సమస్య, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, జీపీకి రావాల్సిన పెండింగ్ నిధులు వంటి సమస్యలను తండావాసులు సభ దృష్టికి తీసుకొచ్చి వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని గ్రామసభలో తీర్మానించారు. తమ పరిధిలో ఉన్న వాటిని పరిష్కరిస్తూ మిగతా సమస్యలను మండల, జిల్లా అధికారులకు నివేదిస్తామని ఎంపీఓ పేర్కొన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ వైద్యుడు శశాంక్, పంచాయతీ కార్యదర్శి కుర్మన్న, ఫీల్డ్ అసిస్టెంట్ సోమ్లానాయక్, అంగన్‌వాడీ కార్యకర్తలు, తండావాసులు పాల్గొన్నారు.

తీరని తాగునీటి కష్టాలు

- ట్యాంకర్‌తో సరఫరా
- అందని మిషన్ భగీరథ నీరు



8వ వార్డులో ట్యాంకర్ వద్ద నీరు పట్టుకుంటున్న ప్రజలు (ఫైల్)

అమరచింత: మున్సిపాలిటీ కేంద్రంలో నిత్యం ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. మిషన్ భగీరథ ద్వారా 6 ఓవర్‌హెడ్ ట్యాంకులతో నిత్యం 12 లక్షల లీటర్ల తాగునీటిని అందిస్తున్నామని మిషన్ భగీరథ అధికారులు లెక్కలు చూపడంతోనే సరిపోతుందని, ఆచరణలో మాత్రం ప్రజలకు తాగునీటిని అందించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటితో పాటు పట్టణంలో తాగునీటి అవసరాల కోసం 16 సోర్స్ బోర్లు ఉన్నా.. వాటి ద్వారా వచ్చే నీటిని పైప్‌లైన్ల ద్వారా నిత్యం అందిస్తున్నా ప్రజలు మాత్రం కాలనీల్లో కుళాయిల ద్వారా తాగునీరు అందడం లేదని మున్సిపల్ సిబ్బందిని నిలదీస్తున్న పరిస్థితులు దాపరించాయి. వారం రోజుల నుంచి అరకొరగా కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పట్టణంలోని బీసీ కాలనీలోని 6, 7 వార్డుల్లో రెండు, మూడు రోజులకు ఒకసారి కుళాయి ద్వారా, ట్యాంకర్‌తో నీటిని అందించినా పూర్తిస్థాయి అవసరాలు తీరడం లేదన్నారు. కాలనీల్లో ఉన్న చేతి పంపులకు సైతం మరమ్మతులు చేపట్టకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

సీసీ రోడ్డు పనులను అడ్డుకున్న గ్రామస్తులు

- గ్రామసభ పెట్టకుండా తీర్మానం చేయడంపై అభ్యంతరం
- ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శిని నిలదీసిన ప్రజలు



ఎంపీఓ రాజును ప్రశ్నిస్తున్న గ్రామస్తులు

ఖిల్లాఘనపురం: ప్రభుత్వం నుంచి గ్రామ పంచాయతీలకు మంజూరైన నిధులకు సంబంధించి గ్రామసభ పెట్టకుండానే తీర్మానం చేసి ప్రారంభించిన పనులను సోమవారం మండలంలోని ఉప్పరిపల్లి ప్రజలు అడ్డుకున్నారు. గ్రామానికి మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం మెటీరియల్ కాంపోండెంట్ నిధులు రూ.15 లక్షలు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. ఈ నిధులతో గ్రామంలో సీసీ రోడ్లు వేయాలని తీర్మానిస్తూ ఎవ్వరికి చెప్పకుండానే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులకు ప్రత్యేక అధికారి (ఎంపీఓ) రాజు, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్‌గౌడు పనులు అప్పగించారు. మూడు రోజుల నుంచి గ్రామంలో సీసీ రోడ్డు పనులు చేపట్టేందుకు సంబంధిత వ్యక్తులు ప్రయత్నాలు చేయడంతో గ్రామస్తులు అడ్డుకున్నారు. సోమవారం పనులు చేపట్టే వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సురేష్‌గౌడు సిబ్బందితో కలిసి సోమవారం ఉప్పరిపల్లికి వచ్చి.. ఎంపీఓ రాజు, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్‌గౌడ్‌ను గ్రామానికి పిలిచారు. పనులు ఎందుకోసం ఆపుతున్నారని వారు గ్రామస్తులను ప్రశ్నించారు. ఉపాధి హామీ మెటీరియల్ కాంపోండెంట్ ద్వారా వచ్చే నిధులకు సంబంధించి గ్రామసభ నిర్వహించకుండా కొందరు వ్యక్తులకు తీర్మానం ఎలా ఇస్తారని ఎంపీఓ, కార్యదర్శిని గ్రామస్తులు ప్రశ్నించారు. చివరికి జరిగిన తప్పును గుర్తించిన ఎంపీఓ రాజు గ్రామస్తులతో మాట్లాడుతూ.. పొరపాటు జరిగిందని, మరోసారి ఇలా జరగకుండా చూస్తామని సర్దిచెప్పడంతో గ్రామస్తులు శాంతించారు. ఈ పనులకు సంబంధించి మరోమారు గ్రామసభ పెట్టి పనులు చేపడతామని చెప్పారు.

ప్రశాంతంగా కొనసాగుతున్న 'పది' పరీక్షలు



పాన్‌గల్‌లో పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఇంగ్లిష్ పరీక్షకు బాలుర ఉన్నత పాఠశాలలో 210 మంది, బాలికల ఉన్నత పాఠశాలల్లో 139 మంది కలిపి మొత్తం 349 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆయా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు ఆజీమ్‌పాషా, విజయలక్ష్మి, డిపార్టుమెంటల్ ఆఫీసర్లు రాజవర్ధన్‌రెడ్డి, మంజుల తెలిపారు. పరీక్ష కేంద్రాల పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, జనం గుమికూడకుండా స్థానిక పోలీసులకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

441 మంది విద్యార్థులు హాజరు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన పదో తరగతి పరీక్షకు 443 మంది విద్యార్థులకు గాను 441 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓ జయశంకర్ తెలిపారు. బాలికల ఉన్నత పాఠశాలలో 230 మంది విద్యార్థులను గాను 228 మంది, ప్రభుత్వ జనియర్ కళాశాలలో 213 మంది విద్యార్థులను కేటాయించగా అందరూ హాజరైనట్లు ఎంఈఓ చెప్పారు.

ఆత్మకూర్: పట్టణంలోని పదో తరగతి పరీక్షలు పరీక్షా కేంద్రాలను తహసీల్దార్ చాంద్‌పాష సందర్శించారు. కేంద్రాల్లో విద్యార్థులకు సౌకర్యాలు సమకూర్చామని ఎంఈఓ బాలరాజు తెలిపారు. బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలో, కాలేజీ హైస్కూల్ మూడు కేంద్రాలు కలిపి 633 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా.. ఒక్కరు గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. సీఐ శివకుమార్, ఎస్ఐ నరేందర్ ఆధ్వర్యంలో కేంద్రాల వద్ద 144 సెక్షన్‌లో భాగంగా గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కొత్తకోట రూరల్: పట్టణం అభివృద్ధి, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దేవరకద్ర శాసనసభ్యుడు మధుసూదన్‌రెడ్డికి స్థానిక కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. కొత్తకోటను రెవెన్యూ డివిజన్ చేయాలని, సెనిగె చెరువు కట్ట నిర్మాణం, వెడల్పు చేసి వెంకటగిరి దేవాలయం వరకు మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చాలని కోరారు. అదేవిధంగా మున్సిపాలిటీ కొత్త భవన నిర్మాణం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బీసీ హాస్టల్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, రిజిస్ట్రేషన్ ఆఫీస్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. ముఖ్యంగా కొత్తకోటలో 30 పడకల ఆస్పత్రి నుంచి 50పడకల ఆస్పత్రిగా మార్చి, డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. అద్దె భవనాల్లో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలకు కొత్తగా భవనాలు, ఇండోర్ స్టేడియం నిర్మించాలని, ఉర్దూ మీడియం జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు డాక్టర్ పీజే బాబు, ఎస్‌జే బోయేజ్, మేస్త్రీ శ్రీనివాసులు, శ్రీనివాస్‌రెడ్డి, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, లతీఫ్ తదితరులు ఉన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



సర్వే నం.195లో నిర్మాణాలను కూల్చివేసిన అధికారులు

చిన్నంబావి: మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 195లో ఎలాంటి అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాలను స్థానిక తహసీల్దార్ ఇక్బాల్, ఎంపీడీఓ రమణరావు జేసీబీతో తొలగించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దదగడ శివారులో సర్వే నెంబర్ 195లో గల ప్రభుత్వ భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను కలెక్టర్ ఆదేశాల మేరకు తొలగించామన్నారు. ఈ కూల్చివేతలను అడ్డుకునేందుకు ప్రయత్నించిన యజమానుల కుటుంబ సభ్యులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తాము పట్టా ద్వారానే భూమిని కొనుగోలు చేశామని, కేవలం కక్ష్య సాధింపు ధోరణితో తమ నిర్మాణాలు కూల్చివేశారని బాధితులు ఆరోపించారు. గతంలో 53 జీఓ ద్వారా తాము రెగ్యూలరైజేషన్ కోసం అర్జీ పెట్టుకున్నామని, ఈ నిర్మాణాలు కూల్చొద్దని హైకోర్టు స్టే ఇచ్చినా.. అధికారులు కావాలనే నిర్మాణాలను కూల్చారని బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా.. తాము లేని సమయంలో కూలగొట్టడం దారుణమని మండిపడ్డారు.